

ప్రణాళిక సరే.. పైసలేవి?
వానాకాలం జాగ్రత్తలపై పంచాయతీలకు
ప్రభుత్వ ఆదేశాలు
అవగాహన కల్పించాలని ఉత్తర్వులు
నిధుల మాటేంటని కార్యదర్శుల చర్చ
8



కృష్ణయ్యను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

బీసీ రిజర్వేషన్ల అమలు తర్వాతే
ఎన్నికలు నిర్వహించాలి

» బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

వికారాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలపరంగా రిజర్వేషన్ ఇస్తామంటే బీసీలను మోసగించడమేనని అన్నారు. రిజర్వేషన్ ప్రకటించకుండా ఎన్నికలకు పోతే బీసీ సమాజం ఒప్పుకోదన్నారు. కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగి మల్లేశ్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్, రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి రవి యాదవ్, బీసీ వికారాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సాయిలు, తదితర స్థానిక నాయకులు వారి వెంట ఉన్నారు.

గురుకులాల్లో తాత్కాలిక పోస్టుల భర్తీకి
దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదారాబాద్ జిల్లాల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఇంటర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు గురుకులాల ప్రాంతీయ జోన్-6 అధికారి నిర్మల ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19న సరూర్‌నగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే రిజిస్ట్రేషన్ డెమోకు హాజరు కావాలని తెలిపారు. పాఠశాలకు సంబంధించి ఇంగ్లిష్, హింది, గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సాంఘిక శాస్త్రం, లైబ్రేరియన్, హెల్త్ సూపర్‌వైజర్ కళాశాలకు సంబంధించి గణితం, బోటని, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్ సబ్జెక్టులు బోధించడానికి తాత్కాలిక పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టిన నియామకాల్లో అధికారులు నిబంధనలను అతిక్రమించారు. అర్హులకు దక్కాల్సిన ఉద్యోగాలు అనర్హులకు దక్కేలా చక్రం తిప్పారు. ఇలాంటి అవకాశం మళ్లీ రాదనుకున్న అధికారులు భారీగా వసూళ్లకు తెగబడి అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ కింద జిల్లాకు మంజూరైన 25 ఎంఎల్‌హెచ్‌పీ, 17 జీఎన్ఎం పోస్టుల భర్తీలో కాసులకు కక్కుర్తి పడ్డ అధికారులు ఆర్‌వోఆర్ విధానం అమలు చేయకుండా రోస్టర్ కేటగిరిల్లో మెరిట్ అభ్యర్థులను వదిలేసి తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారన్న ప్రచారం జరుగుతోంది.

- ఎంఎల్‌హెచ్‌పీ, జీఎన్ఎం నియామకాల్లో చేతివాటం
- రోస్టర్, మెరిట్‌లో నిబంధనలకు తిలోదకాలు
- అర్హులకు కాకుండా అనర్హులకు పోస్టింగులు
- ఒక్కో పోస్టుకు ఒక్కో రేటు..
- భారీగా వసూళ్లు
- ఆందోళనలో అర్హులైన అభ్యర్థులు



వైద్యారోగ్య శాఖలో
అవినీతి బాగోతం!

ఉద్యోగ నియామకాల్లో ఇష్టారాజ్యం

వికారాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ కింద జిల్లాకు 25 ఎంఎల్‌హెచ్‌పీ, (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్), 17 జీఎన్ఎం (స్టాఫ్ నర్స్) పోస్టులు మంజూరయ్యాయి. ఈ పోస్టులు భర్తీకి 2024, ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు మొత్తం 120 దరఖాస్తులు రాగా, దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంబీబీఎస్ అభ్యర్థి ఒకరు, బీఏఎంఎస్ అభ్యర్థులు 37, బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులు 82 మంది ఉన్నారు. ఈ పోస్టుల భర్తీలో మొదటి ప్రాధాన్యత ఎంబీబీఎస్ అభ్యర్థులకు, రెండో ప్రాధాన్యత బీఏఎంఎస్ వారికి, మూడో ప్రాధాన్యత బీఎస్సీ(నర్సింగ్) అభ్యర్థులకు ఇచ్చి రోస్టర్ ప్రకారం ఈ నియామకాలు చేపట్టాలి. మొదటి విడతలో 23 మంది ఎంపిక య్యారు. ఎంఆర్, స్పోర్ట్స్ అభ్యర్థులు లేక రెండు పోస్టులు భర్తీ చేయలేదు. మొదటి విడతలో ఎంపికైన అభ్యర్థులు విధుల్లో చేరకపోవడం, ఇంతకు ముందు ఎంఎల్‌హెచ్‌పీగా పని చేస్తున్న వారు తమ ఉద్యోగాలకు రాజీనామా చేయడం వల్ల ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు

మిగతా 8వ పేజీలో...

జీఎన్ఎం ఉద్యోగాల్లోనూ అదేతీరు...

జీఎస్ఎం(నర్సింగ్) నియామకాల్లోనూ అర్హులకు ఉద్యోగాలు దక్కకుండా చేశారు. మంజూరైన 17 పోస్టులను భర్తీ చేసేందుకు మొదటి విడతలో 15 మంది అభ్యర్థులను ఆర్‌వోఆర్ ప్రకారం 92 ఎస్టీ నుంచి 108 ఎస్టీ (మహిళ) వరకు నియమించగా, దీంట్లో 100 ఈడబ్ల్యుఎస్, 106 వీహెచ్ అభ్యర్థులు అందుబాటులో లేరు. ఇద్దరు అభ్యర్థులు వ్యక్తిగత కారణాలతో విధుల్లో చేరలేదు. ఇంతకు ముందు ఖాళీగా ఉన్న రెండు పోస్టులతో పాటు విధుల్లో చేరని రెండు పోస్టులను భర్తీ చేయడంలోనూ తమకు అనుకూలంగా ఉన్న అభ్యర్థులు ఏ రోస్టర్‌కు ఫిట్ అవుతారో ఆ దాని ప్రకారం భర్తీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదటి విడత కౌన్సెలింగ్ రోస్టర్ పాయింట్ 92 ఎస్టీ నుంచి 108 ఎస్టీ మహిళ వరకు ఉండగా, రెండో విడత కౌన్సిలింగ్ 109 ఈడబ్ల్యుఎస్ నుంచి ప్రారంభం కావాలి. ఈ కేటగిరి అభ్యర్థి లేని కారణంగా 110 బీసీ-బీ (మహిళ) నుంచి ప్రారంభించి 113 ఓసీ/ఎక్స్ సర్వీస్‌మెన్ కేటగిరితో ముగించాలి. కానీ 110 బీసీ-బీ(మహిళ) కేటగిరిలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వచ్చినా ఆ రోస్టర్ పాయింట్‌ను వదిలేసినట్లు ఆరోపణలు ఉన్నా యి. ఇతర రోస్టర్ కేటగిరిల్లో ఉన్న అభ్యర్థుల్లో నూ మెరిట్ వదిలేసి వారి తర్వాత ఉన్న వారిని ఎంపిక చేశారని ప్రచారం జరుగుతోంది.



మెరిట్ అభ్యర్థులను కాదని..

ఖాళీగా ఉన్న ఆరు ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాల భర్తీలో అధికారులు ఎంపిక చేసిన తీరుపట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 137 బీసీ-బీ అభ్యర్థుల్లో ఓ అభ్యర్థికి 72.03 శాతం మెరిట్ మార్కులు ఉండగా, అధికారులు 69.24 శాతం మార్కులు ఉన్న అభ్యర్థిని ఎంపిక చేశారు. 138 ఓసీ మహిళ రోస్టర్‌లో 71.17 శాతం మార్కులు ఉన్న అభ్యర్థిని పక్కనబెట్టి 67.41 శాతం ఉన్న మరో కేటగిరికి చెందిన అభ్యర్థిని ఎంపిక చేశారు. 140 ఓసీ రోస్టర్‌లో 70.79 శాతం ఉన్న అభ్యర్థిని కాదని.. మరో కేటగిరికి చెందిన 67 శాతం ఉన్న అభ్యర్థిని ఎంపిక చేశారు. 141 ఎస్సీ రోస్టర్ ఉండగా, ఈ ఉద్యోగానికి 70.59 శాతం మార్కులు ఉన్న అభ్యర్థి అందుబాటులో ఉన్నా.. 64.55 శాతం ఉన్న వారిని ఎంపిక చేశారు. 142 ఎస్టీ రోస్టర్ ఉండగా, 67.45 శాతం మార్కులు ఉన్న అభ్యర్థిని కాదని 64.45 శాతం ఉన్న అభ్యర్థి ఎంపిక య్యారు. 146 ఓసీ రోస్టర్‌లో కూడా ఆ కేటగిరి అభ్యర్థిని కాదని మరో కేటగిరికి చెందిన అభ్యర్థిని ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. ఆరు పోస్టులను కూడా తమకంటే తక్కువ మెరిట్ ఉన్న వారికే కేటాయించారని బాధిత అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మెరిట్ ఆధారంగా తమకు కౌన్సిలింగ్ సమాచారం ఇవ్వకుండా.. తమకు నచ్చిన వారిని నియమించుకున్నారని మండిపడుతున్నారు.



పరుచుకున్న పచ్చదనం

పెద్దేముల్ - తాండూరు మార్గంలో పచ్చని చెట్లతో రోడ్డు అందంగా దర్శనమిస్తోంది. ఈ చెట్ల కింద వాహనదారులు, పాదాచారులు కాసేపు ఆగి సేద తీరుతున్నారు. దాదాపు రెండు కి.మీ. వరకు పరుచుకున్న ఈ పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సుద్దతో వాయుకాలుష్యం ఉండే ఈ ప్రాంతంలో బుద్దారం నుంచి గాజీపూర్ వరకు రోడ్డుపై ఇరువైపులా కనిపిస్తున్న పచ్చదనాన్ని చూసిన వారంతా మంత్రముగ్దులవుతున్నారు.

-పెద్దేముల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి)

కీసరగుట్టలో ప్రత్యేక పూజలు

» పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

కీసర రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు తెరుచుకోవడంతో సెలవు రోజైన ఆదివారం కీసరగుట్టకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజామున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గర్భగుడిలోని మూలవిరాట్టును పంచామృతాలతో అభిషేకించారు. ముందుగా అర్చకులు ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం, ఆ తర్వాత స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మంటపంలో ఉత్సవ మూర్తులకు భక్తులతో అర్చనలు చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ప్రదోశ కాల పూజ అనంతరం స్వామి వారికి పవళింపు సేవ నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దివ్యాంగులకు చేయూత

- 40శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు అర్హులు
- 18వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం
- మేడ్చల్ జిల్లాలో 34,057 మంది దివ్యాంగులు

ఉచితంగా 346 పరికరాలు పంపిణీ



సిద్ధంగా ఉన్న పరికరాలు

రెట్రో ఫిట్టెడ్	
మోటరైజ్డ్ వెహికిల్స్	78
బ్యాటరీ వీల్‌చైర్స్	24
మొబైల్ బిజినెస్	
బ్యాటరీ ట్రైసైకిల్స్	31
బ్యాటరీ మినీ ట్రేడింగ్	
ఆటో వెహికిల్స్	02
హైబ్రీడ్ వీల్ చైర్లు	08
ల్యాప్‌టాప్స్	37
ట్యాబ్స్	20
5జీ స్మార్ట్ ఫోన్లు	04
ట్రైసైకిళ్లు	10
వీల్‌చైర్లు	10
చేతి కర్రలు	39
చెవిటి మెషీన్లు	04
స్మార్ట్ కేన్స్	20
ఎంసీఆర్ చప్పల్స్	20
మొత్తం	346



మేడ్చల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దివ్యాంగులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలకు 342 వివిధ పరికరాలు కేటాయించింది. ఈ పరికరాలు పొందేందుకు 18వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా అవకాశం కల్పించింది. వారి వారి అర్హతలను బట్టి సంబంధిత పరికరాలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. చదువుకునే విద్యార్థులకు, వినికిడి సమస్య, కంటి చూపు సమస్య ఉన్న వారికి ఆయా పరికరాలను అందించనున్నారు. వాటిని పొందేందుకు 40 శాతం కన్న ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులు అర్హులు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే పరికరాలు పొందేందుకు దివ్యాంగులు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను

మిగతా 8వ పేజీలో...

సుందరీకరణ.. సుదూరం!

- పనులకు శంకుస్థాపన చేసి 10 నెలలు పూర్తి
- ముందుకు సాగని గొల్ల చెరువు ట్యాంక్‌బండ్ పనులు
- తాండూరు పట్టణ ప్రజలకు కరువైన ఆహ్లాదం

తాండూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడంతో పాటు కాలక్షేపం కోసం తాండూరు పట్టణంలోని గొల్ల చెరువును ట్యాంక్ బండ్‌గా సుందరీకరించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోనే మొట్ట మొదటి ట్యాంక్ బండ్‌గా గుర్తించినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ఆ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఈ ట్యాంక్‌బండ్ నిండా పిచ్చమొక్కలు, కంప చెట్లు

మిగతా 8వ పేజీలో...



అధ్వానంగా గొల్లచెరువు కట్ట రోడ్డు

నేడు రైతు వేదికల్లో
వీడియో కాన్ఫరెన్స్

తాండూరు రూరల్/యాలాల, జూన్ 15, (ఆంధ్రజ్యోతి): నేడు(సోమవారం) తాండూరు, యాలాల మండలాల్లోని రైతు వేదికలలో నూతన వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించనన్నట్లు తాండూరు వ్యవసాయాధికారి కొమరయ్య, యాలాల వ్యవసాయాధికారి శ్వేతారాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.సాయంత్రం 4గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లను ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో రైతు భరోసా, వివిధ పథకాలను ప్రారంభిస్తారన్నారు. లైవ్‌లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తాండూరు మండలం అంతారం రైతు వేదికలో కాన్ఫరెన్స్‌ను వీక్షించేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాలు, అధికారులు తప్పక హాజరు కావాలని వారు కోరారు.

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్

తాండూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతంలో క్రికెట్‌పై ఎంతో మంది క్రీడాకారులకు ఆసక్తి ఉందని అందువలన మంచి క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్ కోరారు. అలాగే యువత క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఆదివారం రాత్రి తాండూరు పట్టణం విలియమూన్ మైదానంలో జీఎంకే బిల్డర్స్ అధినేత ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో 18 రోజులుగా నిర్వహించిన విలియమూన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తాండూరులో రూ. 200 కోట్లతో మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొనగా ఫైనల్స్ తాండూరు ఆల్వూర్ ఖాన్ వర్సెస్ జీఎంకే జట్ల మధ్య జరిగింది. కాగా, విన్నర్‌గా ఆల్వూర్ ఖాన్ జట్టు, రన్నర్‌గా జీఎంకే జట్టు నిలిచింది. విజేతకు ట్రోఫీతో పాటు రూ. 50వేలు నగదు, రన్నర్‌కు రూ.25వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో జీఎంకే బిల్డర్స్ అధినేత ముజీబ్ ఖాన్, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, డాక్టర్ సంపత్ కుమార్, పట్లోళ్ల నర్సిములు, హబీబ్‌లాల, సర్దార్ ఖాన్, అబ్దుల్ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మాజీ ఎంపీ అజారుద్దీన్‌కు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్వాగతం పలికి సన్మానించారు.



ట్రోఫీని అందజేస్తున్న అజారుద్దీన్, ఎమ్మెల్యే

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి

కందుకూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతీ కార్యకర్త, నాయకులు సమష్టిగా కలిసి పని చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మీర్కాన్‌పేట గ్రామ మాజీ సర్పంచ్ దేరంగుల నర్సింహ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు తుక్కుగూడ మున్సిపాలిటీలోని ఏనుగు జంగారెడ్డి నివాసానికి వెళ్లి ఆయన్ను ఘనంగా సన్మానించారు. జంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాలకతీతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు స్థానికంగా కాంగ్రెస్ నాయకులు చేపడుతున్న పనులను ప్రజలకు వివరిస్తూ స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కప్పాటి పాండురంగారెడ్డి, అందుగుల సత్యనారాయణ, కె.మదన్‌పాల్‌రెడ్డి, కాకి నర్సింహ, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జి.నరసింహ, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.


జంగారెడ్డిని సన్మానిస్తున్న మీర్కాన్‌పేట కాంగ్రెస్ నాయకులు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన విశ్రాంత ఉద్యోగి, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కడారి శివరాజ్ కుటుంబాన్ని ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా శివరాజ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన కుమారులు కడ్తాల మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, రమేశ్, హర్షవర్దన్‌లను పరామర్శించారు. పరామర్శించిన వారిలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు వెంకటేశ్, మల్లేశ్‌గౌడ్, సుమన్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.


రామకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

● ఎంఏఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింగ్‌రావు

ఆమనగల్లు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జనాభాలో సగభాగమైన బీసీలు సంఘటితమై రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలని మన ఆలోచన సాధన సమితి(ఎంఏఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీలను చైతన్యం చేసి గ్రామ స్థాయి నుంచి బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించి హక్కులను సాధించుకునేందుకు మన ఆలోచన సాధన సమితి కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం మనఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ కులాల నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి నర్సింగ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక జాతీయ రహదారిపై జెండాను ఆవిష్కరించారు. బీసీలు సంఘటిత శక్తినిచాటాలన్నారు.ఎర్రవోలుశ్రీను, శ్రీశైలంయాదవ్, బుచ్చయ్య, వరికుప్పల శ్రీనివాస్, వడ్డె రాజు, గండికోట జంగయ్య, శ్రీశైలం యాదవ్, వెంకటేశం, నరేందర్, చెన్నకేశవులు పాల్గొన్నారు.


ఆమనగల్లులో నిర్వహించిన ర్యాలీలో నర్సింగ్‌రావు, నాయకులు

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

తలకొండపల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూర బ్రహ్మయ్య కోరారు. గట్టిప్పలపల్లిలో బీసీల చైతన్యమే ధ్యేయంగా మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ కులాల సమావేశం నిర్వహించారు. బీసీ నాయకులతో కలిసి ఆయన జెండా ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ జయమ్మవెంటయ్య, నాయకులు పవన్ వాల్మీకి, దశరథ్, సాయిలు, మహేశ్, అంజి,లింగం, మహేశ్ యాదవ్, బక్కయ్య, వెంకటయ్య, సీతారామ్, మధు, జంగయ్య, గ్రామనాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బర్క కృష్ణ

ఐక్యతతో ఏదైనా సాధ్య మే..

చౌదరిగూడ: బీసీలు ఐకమత్యంతో ఉంటూ ముందుకుసాగాలని, అప్పుడే ఏదైనా సాధించగలమని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం కొందుర్గులో బీసీసేన మహిళ మండల అధ్యక్షురాలు అనితగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం అందరూ సమష్టిగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా బీసీసేన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొందుర్గు బీసీసేన మండలాధ్యక్షుడిగా ఐలపురం రమేష్, ఉపాధ్యక్షుడిగా గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శిగా చిన్నరాజుగౌడ్‌లతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. బీసీసేన నాయకులు మచ్చ సుధాకర్‌రావు, చంద్రస్వామి, సుధాకర్ కందుకముల కృష్ణయ్యగౌడ్, చంద్రశేఖర్, రాములు, దయ్యాల శేఖర్, చెన్నయ్య సత్యయ్య, బాల్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి : జెండాను ఆవిష్కరిస్తున్న బ్రహ్మయ్య

ప్రజా ఉద్యమాలతో చేరువవ్వాలి

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ నాయక్

యాచారం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలతో ప్రజలకు చేరువవ్వాలని, పాలకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ నాయక్ అన్నారు. అలాంటి వారి ఆగడాలను తిప్పికొట్టడానికి కమ్యూనిస్టులు నిరంతరం ప్రజలతో కలిసి ఉండాలని అన్నారు. ఆదివారం యాచారం మండల సీపీఎం రాజకీయ శిక్షణ శిబిరం ముగింపు సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో రాజీలేని పోరాటాలు చేసే కమ్యూనిస్టులకు ప్రజల్లో ఆదరాభిమానాలుంటాయన్నారు. పాలకులు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోగా కొత్త కొత్త హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ విధానాలపై ధ్వజమెత్తారు. కమ్యునిస్టు ఉద్యమాలను అణచి వేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని, వారి కుట్రలకు జనం బుద్ధి చెబుతారని అన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు తమ అనుచరులకు ఇప్పస్తున్నారని మండిపడ్డారు. ఇంటర్ కళాశాలలు నడుపుతున్న యాజమాన్యాలకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ రావడం లేదన్నారు. దాంతో కళాశాలల యజమాన్యాలు టీసీలు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులపాలు చేస్తున్నారని, ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ అంశంపై ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఉద్యమాలు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, సామాజిక పింఛన్ల మంజూరు వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ ప్రాంతంలో ఫ్యూచర్‌సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, భూములు కోల్పోతున్న రైతులతో కలిసి ఇక్కడ ఏర్పాటు చేయకుండా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు ఆలంపల్లి జంగయ్య, పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న శ్రీరామ్ నాయక్

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

చౌదరిగూడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. శనివారం రాత్రి కొందుర్గు మండల పరిధిలోని మహాదేవ్‌పూర్‌లో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్లుగా మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని పోరాటం చేసి విజయం సాధించినట్లు గుర్తుచేశారు. నాయకులు పి.నరసింహ, సుదర్శన్, లింగం, ప్రవీణ్, నరసింహ, రమేష్, సతీష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

గుప్త నిధులకు తవ్వకాలు ?


కీసరగుట్ట ఆలయం వెనక లింగాలకుంట వద్ద తవ్వకాలు

కీసర రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కీసరగుట్ట ఆలయం వెనకాల లింగాలకుంట వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చేపట్టిన తవ్వకాలు తీవ్ర కలకలం రేపాయి. మూడు అడుగుల మేర గుంతను తవ్విన చోట పసుపు, ఎర్రని గుడ్డ, కొబ్బరి కాయ ఘటనా స్థలంలో పడి ఉన్నాయి. గుప్త నిధుల కోసమే ఈ తవ్వకాలుజరిపారా? అని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కీసరగుట్టకు 15 శతాబ్దాల క్రితం విష్ణుకుండీనీల రాజవంశం వారు కీసరగుట్టను కేంద్రంగా చేసుకుని పరిపాలించిన చరిత్ర ఉంది. గతంలోనూ కీసరగుట్ట దేవాలయ పరిసరాల్లో చేపట్టిన తవ్వకాల్లో నాణేలు లభించాయి. దీంతో ఇక్కడ గుప్త నిధుల కోసమే తవ్వకాలు జరిపరేమోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దుండగులపై చర్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు.


ఘటనా స్థలం వద్ద పూజా సామగ్రి

స్పోర్ట్స్ స్కూల్లో అడ్మిషన్లకు సెలెక్షన్లు

శామీర్‌పేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తూంకుంటలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో 4వ తరగతిలో చేరేందుకు (అడ్మిషన్) 17 నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎంపికలకు ఫిజికల్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కమలాకర్ లెలిపారు. ఆదివారం ఆయన మీడియాకు వివరాలు తెలిపారు. మొదటి స్థాయిగా మండల స్థాయిలో ఈ నెల 17న శామీర్‌పేటలోని మినీ స్టేడియం గ్రౌండ్స్‌లో ఉదయం 9.30 గంటలకు అర్హులైన విద్యార్థులకు అర్హత ఫిజికల్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. 1 సెప్టెంబర్ 2016 నుంచి 31 ఆగస్టు 2017 మధ్యలో జన్మించిన 8 నుంచి 9 ఏళ్ల వయస్సు కలిగి ఉన్న విద్యార్థులు మండల స్థాయి పరీక్షల్లో పాల్గొనేందుకు అర్హులని ఎంఈఓ తెలిపారు. మండల స్థాయిలో ఎంపికలకు వచ్చే విద్యార్థులు పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బోనోఫైడ్, 3వ తరగతి ప్రోగ్రెస్ కార్డు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకుని రావాలని సూచించారు. మండల స్థాయిలో అర్హత సాధించిన విద్యార్థులను 23 నుంచి 26 వరకు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న అర్హత ఎంపిక పరీక్షలకు పంపనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో అర్హత సాధించిన విద్యార్థులు జూలై 1 నుంచి 5 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న ఎంపికలకు పంపనున్నట్లు తెలిపారు. చివరిగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఫిజికల్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులను రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో అడ్మిషన్ కల్పించనున్నట్లు ఎంఈఓ వెల్లడించారు. ఈ అవకాశాన్ని శామీర్‌పేట మండలంలోని అర్హత గల విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈవో పిలుపు నిచ్చారు.

చెత్తతో నిండిన పిరంగి నాలా

● ముందుకెళ్లని మురుగు, వర్షపు నీరు
● దుర్వాసనతో బస్తీవాసుల అవస్థలు

శంషాబాద్, జూన్15 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వివిధ బస్తీల్లో విస్తరించి ఉన్న పిరంగి నాలా డ్రైనేజీ, వర్షపు నీరు ముందుకెళ్లకపోవడంతో ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కేంద్రంలోని కాముని చెరువు పక్క నుంచి మధురానగర్, ఆదర్శ్‌నగర్, ఆర్బీనగర్ బస్తీల గుండా మిషన్ కాంపౌండ్, హుడా కాలనీ వరకు పిరంగి నాలా విస్తరించి ఉంది. ఈ నాలాలో పలు బస్తీలకు చెందిన డ్రైనేజీ నీటితో పాటు వర్షపు నీరు వెళ్లాల్సి ఉంటుంది. కానీ, చెత్తాచెదారంతో కాలువ నిండిపోవడంతో ముందుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. కొన్ని రోజుల తరువాత పనులు నిలిచిపోయాయి. ఇటీవల కురిసినవర్షాలకు చెత్తా చెదారంతో నిండి పందులకు నిలయంగా మారి మరింతగా దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు.


పిరంగి నాలాలో పేరుకుపోయిన చెత్త

లైబ్రరీ ఏర్పాటుకు సూదిని చేయూత

● 220 గజాల స్థలం కొనుగోలు..

మాడ్గుల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత లైబ్రరీ భవనం శిథిలావస్థకు చేరింది. దాంతో సీఎం రేవంత్‌రెడ్డి మామ సూదిని పద్మారెడ్డి చొరవతో కొత్తగా నిర్మాణం చేసేందుకు తనవంతు చేయూతనిచ్చారు. కాగా, నూతన లైబ్రరీ భవన నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో రూ.75లక్షలు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూదిని కొండల్‌రెడ్డి శుక్రవారం మీడియాతో తెలిపారు. నూతనంగా లైబ్రరీ భవనం నిర్మించటానికి స్థలం సరిపోకపోవడంతో పలుచోట్ల పరిశీలించారు. ఈక్రమంలో పాత లైబ్రరీ పక్కన సూదిని పట్టాభి రాంరెడ్డికి చెందిన 220గజాల స్థలం ఉండగా.. సీఎం రేవంత్‌రెడ్డి మామ సూదిని పద్మారెడ్డి ముందుకొచ్చి రూ.8లక్షలకు కొనుగోలు చేసి లైబ్రరీ భవనం ఏర్పాటు ఏర్పాటుకు దానం చేశారు. పాత భవనం 170గజాల స్థలంలో ఉండగా.. 220 గజాలు కలుపుకొని నూతనంగా లైబ్రరీని నిర్మించనున్నట్లు సూదిని కొండల్‌రెడ్డి తెలిపారు. ఈ విశాలమైన స్థలంలో మంచి డిజైన్‌తో బిల్డింగ్ నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో నిరుద్యోగులు, ఇతరులకు ఉపయోగపడే పోటీ పరీక్షల పుస్తకాలతోపాటు ఇంటర్‌నెట్ సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఈమేరకు సూదిని పద్మారెడ్డి కల నేరవేరనుందని, గ్రామాభివృద్ధితో పాటు పాఠశాల, కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆయన కృషి ఎంతో ఉందని కొండల్‌రెడ్డి తెలిపారు. సూదిని పద్మారెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కొండల్‌రెడ్డి పేర్కొన్నారు.



భూమి డాక్యుమెంట్‌ను చూపిస్తున్న సూదిని పద్మారెడ్డి



పనులను పరిశీలిస్తున్న మండ్లీ రాములు

రూ.60 లక్షలతో గిరిజన భవన్ నిర్మాణం

ఆమనగల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్ కొండ తండాకు గిరిజన భవన్ మంజూరైనట్లు కాంగ్రెస్ జిల్లా నాయకుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లీ రాములు తెలిపారు. ఐటీడీఏ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గిరిజన భవన్ నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. ఆమనగల్లు మండలం శంకర్‌కొండ తండాలో ఆదివారం గిరిజన భవన్ నిర్మాణ స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి రాములు పరిశీలించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నేడు(సోమవారం) శంకుస్థాపన చేస్తారని రాములు చెప్పారు, రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల, చెంచుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. శంకర్ కొండ తండా అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తోడ్పాటునందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

జలాలుద్దీన్ ఉర్సులో ఎమ్మెల్యే ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని హజరత్ సయ్యద్ జాలాల్ ఉద్దీన్ ముల్తానీ రెహ దర్గాలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్, మైనార్టీ నాయకులు గత మూడు రోజుల నుంచి వార్షిక ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. కాగా మూడో రోజు ఆదివారం నిర్వహించిన ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి భక్తిశ్రద్దలతో దైవ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, అలియాబాద్ మాజీ సర్పంచ్ గుర్క కుమార్, మండల మైనార్టీ నాయకుడు చాంద్‌పాషా, నాయకులు దాసరి బాబు, వంగ వెంకట్‌రెడ్డి, హరిమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి భూమి పూజలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహిళల సంక్షేమానికి పెద్దపీట

దోమ/చౌడాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దాదాపూర్ గ్రామంలోని రైతు వేదికలో ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 249మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూర్ చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందరాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్ని హోమం



ఘట్‌కేసర్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్‌లోని భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం అగ్ని హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అగ్ని హోమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎదులాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది యావపూరం శ్రీనాథ్ రావు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కంట్లం శంకరప్ప, శివకుమార్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌భూపాల్ గౌడ్

మోదీ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

ఇబ్రహీంపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పదకొండేళ్ల మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. వీటి గురించి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి హాజరై మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన పాక్‌కు మోదీ తగిన గుణపాఠం చెప్పారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాలు కైవసం చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ కో కన్వీనర్ వై.నారాయణయాదవ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

లైట్ తీసుకోవద్దు


ఉన్నట్టుండి ఆగిపోతున్న హృదయ స్పందన

గుండెపోటుతో తస్మాత్ జాగ్రత్త

అన్ని వయస్కుల వారిపై ప్రభావం

శారీరక శ్రమ, పౌష్టికాహారం తప్పనిసరి

అనుమానమొస్తే వైద్యులను సంప్రదించాలి



షాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు చాలా మట్టుకు అరవై ఏళ్లు దాటిన తర్వాతే గుండెపోటు వచ్చేది. మారుతున్న ప్రస్తుతం పరిస్థితుల్లో పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాల వారికి, అన్ని వయస్కుల వారికి హార్ట్ అటాక్ వస్తూ ఆందోళనకు గురిచేస్తోంది. అప్పటిదాక బాగానే ఉన్నవారు ఉన్నట్టుండి గుండెపోటుతో అనంతలోకాలకు పోతున్నారు. పొద్దంతా పనులు చేసుకొని వచ్చి ఇంటి వద్ద సేద తీరులోపు గుండెపోటుతో మృతిచెందుతున్నారు. పౌష్టికాహార లోపం, ఊబకాయం, శారీరక శ్రమలేకపోవడం, నీళ్లు సరిగా తాగకపోవడం, అధిక కొవ్వు పదార్థాలుండే పదార్థాలు, జంక్‌ఫుడ్ తినడం తదితర కారణాలతో గుండెపోటు వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

ఇవీ పాటించాలి

- వ్యవసాయదారులు, కూలీలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి
- మధ్యాహ్న ఎండలో పని చేయొద్దు.
- శ్రమకు తగ్గ నీరు లేదా నిమ్మరసం తీసుకోవాలి.
- శరీర ఉష్ణోగ్రత పెరగకుండా తరచూ చెట్ల కింద సేద తీరాలి. క్రమం తప్పకుండా డాక్టర్‌తో బీపీ చెక్ చేయించుకోవాలి.
- పట్టణాల్లో ఉండేవారు మానసిక ఒత్తిడికి లోనుకాకూడదు. రోజూ కనీసం 30 నిమిషాలైనా వాకింగ్, వ్యాయామం లేదా యోగా చేయాలి.
- పొగ తాగొద్దు. ఆయిల్ ఫుడ్ సాధ్యమైనంత తక్కువ తినాలి.

40 నుంచి 55ఏళ్లలోపు వారిలో ఎక్కువ

గుండెపోటు 40 నుంచి 55 ఏళ్లలోపు వారికే ఎక్కువగా వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఎండలో పనిచేయడం, సరిగా నీరు తాగకపోవడం, కవాటాలు, వాల్వ్‌లలో కొవ్వు పేరుకుపోవడం, అధిక బరువు, హై/లో బ్లడ్ ప్రెషర్ గుండెపోటుకు ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. కొంతమంది వ్యాయమం చేసినా గుండెపోటుకు గురవుతుండడం కలకలం రేపుతోంది.

హృదయ కండరాల్లో కొవ్వు పేరుకుంటే...

గుండెపోటుకు ప్రధాన కారణం హృదయ కండరాల్లో కొవ్వు పేరుకుపోవడం. గుండె కండరాలకు రక్తప్రసరణ నిలిచి, అది పనిచేయడం ఆగిపోవడాన్నే గుండెపోటు అంటారని వైద్యులు చెబుతున్నారు. ఎడమ చేతివైపు లాగినట్లు అన్పించడం, చాతీలో నొప్పి రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని పేర్కొంటున్నారు. గుండెపోటు సమస్యను నిర్ధారించేందుకు వైద్యపరంగా ఇప్పుడు రకరకాల టెస్టులు అందుబాటులో ఉన్నాయని, వాటితో పరీక్షించుకోవాలని సూచిస్తున్నారు. ఈసీజీ, టీఎంటీ వంటి టెస్టుల ద్వారా ప్రాథమికంగా గుండెపోటు లక్షణాలను నిర్ధారిస్తారు. వ్యవసాయ కూలీలకు ఎక్కువగా గుండెపోటు ఎందుకు వస్తుందంటే వారు శ్రమకు తగ్గ నీరు తీసుకోకపోవడమే ప్రధాన కారణం అని వైద్య నిపుణులు అంటున్నారు. ఎండలో పనిచేయడం వల్ల చెమట రూపంలో శరీరంలోని లవణాలు కరిగిపోతాయి. లవణాలు తగ్గి గుండె ఎక్కువగా కొట్టుకోవడం గానీ, ఆగిపోవడంగానీ జరుగుతుంది. అధిక శారీరక శర్మ చేస్తున్న సమయాల్లో నీరు ఎక్కువ తాగాలి. ఏడు గంటలు ఎండలో పనిచేస్తే కనీసం 2గంటల విశ్రాంతి తీసుకోవాలి. వంశపారంపర్యంగాను గుండెపోటు వచ్చే ఆస్కారం ఉంది.

శారీరక శ్రమ అవసరం



ప్రతీ మనిషికి శారీరక శ్రమ అవసరం. రోజూ 30నిమిషాల వ్యాయమం చేయాలి. ఊబకాయం(ఒబీసిటీ), బీపీ, షుగర్, పొగతాగడం అలవాటు ఉన్నవారికి గుండెపోటు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. ఎండలో పని చేసినప్పుడు సాధారణం కంటే ఎక్కువగానే నీరు తీసుకోవాలి. ఎడమచేతి వైపు నొప్పి వచ్చినట్లయితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

- నాగేంద్రబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఘట్‌కేసర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు సూచించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడలో ఆదివారం నిర్వహించిన వికసిత్ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. తాను ఎంపీపీగా పనిచేసిన సమయంలో కేంద్ర ప్రభుత్వం నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమచేసినట్లు గుర్తుచేశారు. రామోజీ, శోభా, బస్వరాజ్, బాలేష్, రామారావు, సంపత్, రమేష్, జగదీష్, బాలు, ఉదయ్ పాల్గొన్నారు.



రైతువేదికలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

యాచారం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): యాచారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి రైతు వేదికలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. వీటికి తలుపులు లేక ఉపయోగించలేని పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్ల గోడలకు పగుళ్లు వచ్చాయి. నీటి వసతి ఉన్నా స్టాటర్‌కున్న విద్యుత్ వైర్లు తేలి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో దానిని వాడటం లేదు. దీనిని నిర్వహణ కొరవడటంతో రైతు వేదికకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు.

కోనోకార్పస్ చెట్ల తొలగింపు షురూ

» పరిగి రోడ్డులో ప్రారంభం



పరిగి రోడ్డు మధ్యలోని కోనోకార్పస్ చెట్లను తొలగిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

షాద్‌నగర్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విషపూరిత చెట్లుగా నిర్ధారించబడి, తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన కోనోకార్పస్ చెట్ల నరికివేత ప్రారంభమైంది. షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డు మధ్యలో ఉన్న ఈ చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపాలిటీ సిబ్బంది చేపట్టింది. విదేశీ మొక్క అయిన కోనోకార్పస్ ఎడారిలో సైతం ఏపుగా పెరుగుతుంది. ఈ మొక్కలను పశువులు, మేకలు, గొర్రెలు తదితర జంతువులు తినవు. పక్షులు కనీసం గూడు కూడ పెట్టవు. క్రిమి కీటకాలు వీటి జోలికి రావు. ఏపుగా, పచ్చగా పెరిగే ఈ చెట్లను హరిత హారంలో భాగంగా రోడ్ల మధ్యలో, రెండు వైపులా విరివిగా నాటారు. షాద్‌నగర్ పట్టణంలోనే కాకుండా ఇతర ప్రధాన రహదారులు, గ్రామీణ రోడ్లకు ఇరువైపులా నాటడంతో అవి ఏపుగా పెరిగాయి. చాలా ప్రాంతాల్లో ఉన్న చెట్లు పూత, కాతకు వచ్చాయి. పూత, కాత సమయంలో వెలువడే పుప్పొడి రేణువులు మనిషి శ్వాసకోశంపై ప్రభావం చూపుతూ, పలు రుగ్మతులకు కారణమవుతున్నాయని ఈ చెట్లను పలు దేశాలు నిర్ధారించాయి. దీంతో ఆ చెట్లను నిషేధించి తొలిగించాయి. భారత్‌లోని గుజరాత్, అస్సాంతో పాటు తెలంగాణ ప్రభుత్వాలు సైతం కోనోకార్పస్ మొక్కలను పెంచొద్దని నిర్ణయించాయి. దాంతో షాద్‌నగర్ మున్సిపాలిటీ కోనోకార్పస్ చెట్లను తొలగించే పనిలో నిమగ్నమైంది.

కొత్త మొక్కలను నాటిస్తాం



మనుషుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని కోనోకార్పస్ చెట్లను ప్రభుత్వం నిషేధించింది. పర్యావరణానికి కూడా మంచివి కావన్న ఉద్దేశంతో ఈ చెట్లను తొలగిస్తున్నాం. వాటి స్థానంలో సమాజానికి మేలు చేసే మొక్కలను నాటి సంరక్షిస్తాం. ఇక ముందు కోనోకార్పస్ మొక్కలను ఎవరూ నాటొద్దు.

సునీత, మున్సిపల్ కమిషనర్

ఇక్కడ ఎప్పుడు తొలగిస్తారో?



చౌదరిగూడ: తుమ్మలపల్లిలో కోనోకార్పస్ చెట్లు

చౌదరిగూడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సాక్షిగా కోనోకార్పస్ చెట్లను తొలగించాలని ప్రభుత్వం సూచించింది. ఈ చెట్లు వాతావరణ సమతుల్యతపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో వీటి తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో వీటిని ఎక్కువగా నాటారు. వీటిని తొలగించాలని మండల ప్రజల నుంచి సైతం వినతులు వస్తున్నాయి. ప్రస్తుత వర్షాకాలంలోనే వీటిని తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని కోరుతున్నారు.

జీపీ కార్యాలయాలకు పక్కా భవనాలు కరువు

» శిథిలావస్థకు చేరినవి కొన్నయితే... ఇతర భవనాల్లో కొనసాగుతున్నవి మరికొన్ని..

» సభలు, సమావేశాలకు తప్పని ఇబ్బందులు



ఇరుకైన డ్వాక్రా భవనంలో కొనసాగుతున్న ధర్మన్నగూడ జీపీ కార్యాలయం

యాచారం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక ఇబ్బందిగా మారింది. కొన్ని చోట్ల కార్యాలయాలు శిథిలావస్థకు చేరకుంటే.. మరికొన్ని చోట్ల డ్వాక్రా భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలోని ధర్మన్నగూడ, తక్కళ్లపల్లితండా, అయ్యవారిగూడ, కేస్లీతండాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. తక్కళ్లపల్లి తండా పంచాయతీ భవన నిర్మాణం కోసం రూ.40లక్షలు కేటాయించింది. అయితే, భవన నిర్మాణ పనులు పిల్లర్ల వరకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం ఆ గ్రామపంచాయతీల కార్యాలయాలు డ్వాక్రా భవనాల్లో కొనసాగుతున్నాయి. పక్కా భవనాలు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని అప్పటి సర్పంచులు మారు, గంగాబాయి, భాషయ్య, జగదీష్ అప్పటి కలెక్టర్, జెడ్పీ సీఈవో, మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు. కానీ, ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తక్కళ్లపల్లితండా పంచాయతీ భవనానికి అరకొరగా నిధులు కేటాయించడంతో భవన నిర్మాణ పనులు పిల్లర్లకే పరిమితమైందని తండావాసులు ఆందోళన చెందుతున్నారు. ఇకపోతే తాటిపర్తి, చిన్నతూండ్ల, చౌదర్‌పల్లి, నందివనపర్తి, మల్కీజ్‌గూడ గ్రామాల పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇవి కూడా ఇరుకైన భవనాల్లో కొనసాగుతున్నాయి. తాటిపర్తి గ్రామపంచాయతీ భవనం నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. చౌదర్‌పల్లి జీపీ భవనం 1960లో నిర్మించగా ఆనాటి బాలబడి కేంద్ర భవనాన్ని నేడు పంచాయతీ కార్యాలయంగా వాడుతున్నారు. తాటిపర్తి, చిన్నతూండ్ల, చౌదర్‌పల్లి, మల్కీజ్‌గూడ, నందివనపర్తి, తక్కళ్లపల్లితండా, ధర్మన్నగూడ, అయ్యవారిగూడ, కేస్లీతండా గ్రామపంచాయతీ కార్యాలయాల భవనాల్లో కనీస వసతులు లేకపోవడంతో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. సభలు, సమావేశాలు జరిగే సమయాల్లో వార్డు సభ్యులు, అధికారులు ప్రజాప్రతినిదులు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భవనాలు కట్టిస్తుందని ఆశలు పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. పక్కా భవనాలు నిర్మించడానికి నిధులు కేటాయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భవన నిర్మాణానికి నిధులు కేటాయించండి



గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం చాలామార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది. భవన నిర్మాణం కోసం రూ.50లక్షల నిధులు కేటాయించాలి. ఇరుకైన భవనంలో ఉండడంతో రికార్డులకు భద్రత లేకుండా పోతోంది. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ తీసుకొని భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలి.

- భాషయ్య, ధర్మన్నగూడ మాజీ సర్పంచ్

జీపీ భవనం శిథిలావస్థకు చేరింది



తాటిపర్తి గ్రామపంచాయతీ భవనం చాలా పురాతన కాలం నాటిది. అసలే ఇరుకుగా ఉంది. ఆపై శిథిలావస్థకు చేరింది. కలెక్టర్ భవన నిర్మాణం కోసం రూ.60లక్షల నిధులు విడుదల చేసి ఆదుకోవాలి. భవనం ఎప్పుడు కూలుతుందా అనే భయంతో కాలం గడుపుతున్నాం. అలాగే పశు సంవర్థకశాఖ కార్యాలయ భవనానికి మరమ్మతులు చేయించడానికి రూ.15లక్షల నిధులు కేటాయించాలి.

- దూస రమేష్, తాటిపర్తి మాజీ సర్పంచ్



ఘట్‌కేసర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపేందర్

యువత అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఘట్‌కేసర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆల్విన్ రిటైర్డ్ ఉద్యోగి వేదాంతం ఉపేందర్ అన్నాడు. ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, దాసు, నర్సింగ్‌రావు, రాందాస్, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్ రావు, జగదీష్ పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న గట్టగల్ల ప్రశాంత్ మాదిగ

తాండూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలు మాదిగ యువత అందిపుచ్చుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ అన్నారు. ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జిను గుర్తి నర్సింహులు మాదిగ అధ్యక్షతన ఆదివారం ఎమ్మార్పీఎస్ తాండూరు నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రశాంత్ మాదిగ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30ఏళ్ల అవిశ్రాంత పోరాటం చేశారని, ఈ పోరాటంలో ఎందరో మాదిగలు తమ ప్రాణాలను కోల్పోయారని గుర్తుచేశారు. జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాండూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. యాలాల సూర్య ప్రకాష్ మాదిగ, బి.కృష్ణ మాదిగ, జగదీష్ మాదిగ, ఉమాశంకర్ మాదిగలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణా, తాండూరు మండల ఉపాధ్యక్షుడు పరశురాం మాదిగ, బసప్ప, మెట్లీ కృష్ణ మాదిగ, సీహెచ్.రవి కుమార్, నరేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 552 అర్జీలు

● ఘట్‌కేసర్ తహసీల్దార్ డీఎస్ రజిని

ఫటా ఫట్



ఘట్‌కేసర్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 552 అర్జీలు అందాయి. వచ్చిన అర్జీలను ఆగస్టు 14వ తేదీ లోపు పరిష్కరిస్తామని తహసీల్దార్ డీఎస్ రజిని తెలిపారు. ఆమె ఆదివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు ఎన్ని?

తహసీల్దార్: మొత్తం 552 అర్జీలు అందాయి. అధికంగా ఎదులాబాద్ నుంచి 138 అర్జీలు, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ నుంచి ఒక అర్జీ మాత్రమే వచ్చింది.

ఆంధ్రజ్యోతి: ఏఏ సమస్యలపై ఎక్కువగా వచ్చాయి?

తహసీల్దార్: మిస్సింగ్ సర్వేనెంబర్లు, నోషనల్ ఖాతా(హౌసింగ్ సైట్స్) పట్టా మార్పు, విస్తీర్ణంలో సవరణలు, పీవోబీ (ప్రోహిబిటెడ్ జాబితా నుంచి) తొలగింపు, పెండింగ్ సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్, నాలా మార్పు, పేర్ల మార్పు, చిరునామా, కులం సవరణలు, 38/ఈ, ఓఆర్‌సీలపై ఎక్కువగా అర్జీలు అందాయి.

ఆంధ్రజ్యోతి: అర్జీల పరిష్కారానికి ఎంత సమయం తీసుకుంటారు?

తహసీల్దార్: ఆగస్టు 14వ తేదీ లోపు సమస్యలను పరిష్కరిస్తాం. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి రిజిష్టర్ ఐడీ ఇస్తాం.

ఆంధ్రజ్యోతి: ఏఏ గ్రామంలో ఎన్ని అర్జీలు వచ్చాయి?

తహసీల్దారు: ఘట్‌కేసర్‌లో 42, ఎదులాబాద్‌లో 138, కొండాపూర్‌లో 25, ప్రతాప్‌సింగారంలో 41, పడమటి సాయిగూడెంలో 10, యంనంపేట్‌లో 27, అవుశాపూర్‌లో 34, ఇస్మాయిల్‌ఖాన్ గూడలో 1, కాచవానిసింగారంలో 9, ముత్వేల్లిగూడలో 21, మాదారంలో 26, అన్నోజిగూడలో 12 అంకుశాపూర్‌లో 63 అర్జీలు అందాయి.

ఆంధ్రజ్యోతి: దరఖాస్తు చేసుకోని వారికి అవకాశం ఉందా?

తహసీల్దార్: రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోనివారు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ పెట్టుకునే అవకాశం ఉంది.

ప్రణాళిక సరే.. పైసలేవి?

● వానాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీలకు ప్రభుత్వ ఆదేశాలు
● అవగాహన కల్పించాలని ఉత్తర్వులు
● నిధుల మాటేంటని చర్చ
● తలలు పట్టుకుంటున్న కార్యదర్శులు



తాండూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు జారీచేసింది. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్- 52 ప్రకారం పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం, రక్షిత మంచినీటి సరఫరాకు గ్రామ పంచాయతీల కనీస బాధ్యతని ఉత్తర్వుల్లో పేర్కొంది. మూడు నెలల పాటు పారిశుధ్య లోపం, కలుషిత నీటి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించింది. అయితే ఇప్పటికే పంచాయతీల్లో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో వానా కాలం ప్రభుత్వ ప్రణాళిక అమలుకు నిధులు ఎలా? అని తర్జనభర్జన అవుతున్నారు.

చేపట్టాల్సిన పనులు

మురుగునీరు నిల్వకుండా, దోమలు వృద్ధి చెందకుండా శుభ్రం చేయాలి. రోడ్లపై ఉన్న చెత్తా చెదారాన్ని డంపింగ్ యార్డుకు ఎప్పటికప్పుడు తరలించాలి. మురుగు కాల్వలు, గుంతల యందు బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. తాగునీటి పైపులైన్ల లీకేజీని అరికట్టాలి. పబ్లిక్ నల్లాలు, చేతిపంపుల వద్ద నీటిని నిల్వకుండా చూడాలి. దుస్తులు ఉతుక్కుంటా, పశువులను కడుగుట, స్నానం చేయుట వాటిని అరికట్టాలి. డ్రైడేని పాటించాలి. హోటళ్లు, మాంసం మార్కెట్లు, చిరు తిండి అమ్మే బండ్లు, దుకాణాల్లో నిల్వ ఉంచే వస్తువులపై జాగ్రత్తలు తీసుకోవాలి. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వను తొలగించడంతో పాటు ఆయిల్ బాల్స్ వేయాలి. ప్రతి రోజు ఫాగింగ్ చేయించాలి. ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి.

ప్రజలకు చెప్పాల్సినవి

కాచి వడబోసిన నీటిని తాగాలి. మలవిసర్జనకు మరుగుదొడ్లనే వాడాలి. నివాస ప్రాంతాల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పారిశుధ్యం పాటించేలా చూడాలి. ఖాళీ డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీటి నిల్వ ఉండకుండా చూడాలి. నీటినిల్వ ఉండే పాత్రలు, తొట్టిలు, ట్యాంకులు, డమ్ములు, బకెట్లపై సరియైన రీతిలో మూతలు ఉంచాలి. దోమ తెరలు, దోమలను పారదోలే పరికరాలను ఉపయోగించాలి. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. మూతలు ఉంచిన ఆహార పదార్థాలనే తినాలి. ఉరుములు, మెరుపుల సమయంలో తీసుకొనే జాగ్రత్తలపై ప్రజలకు సామూహిక ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. దివ్యాంగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఆదేశాల్లో పేర్కొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖతో సమన్వయం

క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖతో సమన్వయం చేసుకోవాలని పంచాయతీశాఖ అధికారులకు సూచించారు. ఎక్కడైనా వాంతులు, విరేచనాల ఘటనలు దృష్టికి వస్తే కారణాలు ఏమిటో తెలుసుకొని ఆరోగ్య శాఖ అధికారులకు తెలియజేయాలి. ఆరోగ్య శాఖ సహకారంతో ఓఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్లు అందించేలా చర్యలు తీసుకోవాలి. మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలి. ఆరోగ్య శాఖ సహకారంతో వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి.

నిధులెట్లా?

అధికారులు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ నిధుల మాట ఏంటనే చర్చ జరుగుతోంది. పంచాయతీల్లో పైసాలేని ప్రస్తుత పరిస్థితిలో జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం గ్రామాల్లో పనులు చేపట్టాలంటే లక్షల రూపాయలు అవసరమవుతాయి. పెట్టిన వాటికి ఇప్పటికే నిధులు రాలేవని, తామెలా ఈ పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. చేయకపోతే చర్యలు తీసుకుంటామని ఆదేశాలు ఇస్తారు. చేద్దామని ముందుకు వెళ్తే నిధుల సమస్య వస్తుంది. ప్రస్తుతం తమ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా ఉందని పంచాయతీ కార్యదర్శులు ఆంధ్రజ్యోతితో వాపోయారు. కనీసం వర్షాకాలంలో ప్రజలకు అంటురోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తే బాగుంటుందని కార్యదర్శులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

ఇళ్ల ఎదుట నిలిపిన రెండు బైకులు చోరీ

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల ఎదుట నిలిపిన రెండు బైకులు చోరీకి గురైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి మల్రెపల్లిగూడలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్రెపల్లిగూడకు చెందిన రాపోలు సురేష్ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ తన ఇంటి ముందు పార్కు చేశాడు. అదే గ్రామానికి చెందిన నీలం దామోదర్‌కు హీరో హోండాస్ప్లెండర్ బైక్‌ను శనివారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. ఆదివారం తెల్లవారుజామున లేచి చూసేసరికి రెండుబైక్‌లు కనిపించలేదు. పరిసరాలను వెతికినా కనిపించలేదు. దీంతో బాధితులు ఇద్దరు ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుకిరువైపులా చెట్ల నరికివేత



ఎన్కెపల్లిలో విద్యుత్ శాఖ అధికారులు నరికేసిన చెట్లు

మోమిన్‌పేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కెపల్లి, మేకవనంపల్లి గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లను విద్యుత్ శాఖ అధికారులు నరికేశారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పర్యావరణ పరిరక్షణ కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి ఎన్ఆర్ఈజీఎస్ కింద రోడ్డుకు ఇరువైపులా చెట్లను నాటించింది. అయితే చెట్లు విద్యుత్ తీగలకు తగులుతున్నాయని విద్యుత్ అధికారులు వాటిని సగానికి నరికి వేయడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముందుచూపుతో వ్యవహరించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు.

రోడ్డుపైకి మురుగు



వినాయక్‌చౌక్‌లో మురుగుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తాండూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని వినాయక్ చౌక్‌లో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. ప్రజలు కూరగాయలకు ప్రధానమైన సరుకులకు, బంగారు దుకాణాలకు ఈ రోడ్డు వెంబడే వెళ్తారు. మురుగు నీటిలో దాటేందుకు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో ఆ ప్రాంత వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు సైతం మురుగును దాటుకుంటు వెళ్లాల్సివస్తోంది. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

గ్రామస్తుల శ్రమదానం



పాలెపల్లిలో రోడ్డుపై గుంతలు పూడుస్తున్న స్థానికులు

దోమ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దోమ-పాలెపల్లి గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారి గుంతలు ఏర్పడింది. బీటీ రోడ్డు లేక గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా ఆదివారం ట్రాక్టర్‌లతో మట్టిని తరలించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు.

అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఫెన్సింగ్, రాడ్లు ధ్వంసం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధి యంనంపేట్‌లోని ప్రధాన చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ఫెన్సింగ్, రాడ్లను కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయమై స్థానికులు పోచారం ఐటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు. స్థానికంగా బిక్షాటన చేసే గుర్తుతెలియని వ్యక్తి చౌరస్తాలో గత కొద్దిరోజులుగా ఉంటున్నాడని, ఈ పని అతడే చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

పాఠశాల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం తగదు

కొడంగల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి ఎస్.సోమశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఇటీవలే ప్రభుత్వం నూతన పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఉప్పరి శేఖర్ తన ఇష్టానుసారంగా పనులను చేపడుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మోహన్‌రెడ్డి సేవలు మరువలేనివి



మాగం రంగారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

దౌల్తాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి సేవలు మరువలేనివని, ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి ప్రథమ వర్ధంతి, సంస్మరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి, విజయ్‌కుమార్, కోటంరాములు, ముద్దప్ప దేశ్‌ముఖ్, వెంకట్రావ్, నందారం ప్రశాంత్, బోడివెంకట్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బషీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన వడ్డే శ్యామమ్మ శనివారం రాత్రి మృతిచెందింది. ఈవిషయం తెలుసుకున్న బషీరాబాద్ మాజీ సర్పంచ్ ప్రియాంకశ్రావణ్ మృతురాలి అంత్యక్రియల కోసం కుటుంబీకులకు ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయాన్ని స్వయంగా ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌దాదా, లింగేశ్, నర్సింహులు, నరేష్ రథోడ్, మణికంఠ పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత

(ఐదో పేజీ తరువాయి)

నమోదు చేసుకుంటున్నారు. రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్‌తదితరాలను కూడా దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. 18వ వరకు దరఖాస్తులు స్వీకరించిన తరువాత పరిశీలన జరిపి అర్హులైన వారికి ఆయా పరికరాలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వైకల్యం, అర్హతల ఆధారంగా ఎంపిక చేయనున్నారు.

సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో పలు సాంకేతిక సమస్యలు ఎదరవుతున్నాయని పలువురు దివ్యాంగులు వాపోతున్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్‌కార్డుతో పాటు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్ ఉండాలి. ఇతర కులాల వారు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. దరఖాస్తు చేసేప్పుడు ఆన్‌లైన్‌లో మొదట శారీరకంగా సమస్య ఏంటని వస్తున్నదని, ఆవెంటనే క్వాలిఫికేషన్ అడిగితే ఆప్షన్ చూపించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత బెనిఫిషర్ ఐడీ, అక్‌నాలెడ్జ్‌మెంట్ రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులో తలెత్తే సమస్యలు తీర్చేందుకు ఒక హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేస్తే బాగుంటుందని దివ్యాంగులు కోరుతున్నారు.

రాజపుత్ మహిళా సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష కార్యదర్శులు

తాండూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజపుత్ మహిళాసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా తాండూరు ప్రాంతానికి చెందిన వారు ఎన్నికయ్యారు. తాండూరులో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా కార్యవర్గంతో పాటు తాండూరు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా నికిత దిలీప్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా సురేఖ కిషన్‌సింగ్‌లు ఎన్నికయ్యారు. తాండూరు శాఖ అధ్యక్షురాలిగా అర్చన శంకర్ సింగ్, కార్యదర్శిగా స్వప్న ఉమేష్‌సింగ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

దశదిన కర్మలో మాజీ మంత్రి



పద్మమ్మకు నివాళులర్పిస్తున్న సబితారెడ్డి, ఆనంద్ తదితరులు

ధారూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి సోదరి పోలీస్ పద్మమ్మ దశదిన కర్మలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. మండలంలోని చింతకుంటలో అనారోగ్యంతో ఇటీవల పద్మమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మలో సబితారెడ్డి పాల్గొని పద్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, హఫీజ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీకి నివాళి

నవాబుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి అనారోగ్యం కారణంగా ఇటీవలే మృతి చెందిన విషయం తెలిసిందే. మేడ్చల్ జిల్లాలోని అంతాయిపల్లిలో ఆదివారం నిర్వహించిన దశ దినకర్మ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తదితరులతో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

బషీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని బషీరాబాద్ మండల వ్యవసాయాధికారిణి అనిత తెలిపారు. జూన్ 5వ తేదీ లోపు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన రైతులు పట్టాపాసుపుస్తకం (పీపీబీ) నంబర్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ జిరాక్సు ప్రతులతో దరఖాస్తు పూర్తి చేసి సంబంధిత గ్రామాల ఏఈవోలకు అందజేయాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

వైద్యారోగ్య శాఖలో అవినీతి బాగోతం!

(ఐదో పేజీ తరువాయి)

రెండో విడత నియామకాలు చేపట్టారు. 103 ఓసీ నుంచి 118 బీసీ డీ వరకు రోస్టర్ ప్రకారం ఎంపిక చేశారు. దీంట్లో 106 పోస్ట్ కేటయించిన వీహెచ్ అభ్యర్థి లేకపోవడంతో ఆ పాయింట్ వదిలేశారు. ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాలు చేసే వారిలో మరికొందరు తమ ఉద్యోగాలకు రాజీనామా చేయడంతో మళ్లీ 14 ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ఉద్యోగాలను రోస్టర్ ప్రకారం 120 బీసీ-ఏ నుంచి 135 బీసీ-బీ వరకు ఎంపిక చేశారు. మూడు విడతల్లో ఎంపికైన అభ్యర్థులు మెరిట్, ఆర్‌వోఆర్ ప్రకారం ఎంపికైనట్లు తెలుస్తోంది.

తమ వారికి ఉద్యోగం వచ్చేలా..

మూడు విడతల కౌన్సెలింగ్ తర్వాత వివిధ కారణాలతో 6 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల ఖాళీలు ఏర్పడగా, ఈ పోస్టులను ఆర్‌వోఆర్ 137 ఓసీ నుంచి 142 ఎస్టీ అభ్యర్థుల ద్వారా భర్తీ చేయాలి. ఆర్‌వోఆర్ ప్రకారం 136 పోస్ట్ ఓసీ ఈడబ్ల్యుఎస్‌కు కేటాయించగా, అభ్యర్థులు ఎవరు దరఖాస్తు చేసుకోలేదని చెబుతున్నారు. రోస్టర్ పాయింట్ ప్రకారం 138 ఓసీ మహిళకు 139 బీసీ-డీ అభ్యర్థికి ఉద్యోగాలు కేటాయించాల్సి ఉండగా, ఆ రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. అధికారులు తమకు కావాల్సిన అభ్యర్థులను నియమించుకునేందుకు బీసీ-డీ అభ్యర్థికి దక్కాల్సిన ఉద్యోగాన్ని ఇతరులకు కేటాయించగా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల్లో కూడా మెరిట్ వారిని వదిలేసి వారి కంటే తక్కువ మెరిట్ ఉన్న వారికి ఉద్యోగాలు ఇచ్చి అర్హులకు అన్యాయం చేశారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఆ అధికారే 'కీ'లకం..

కౌన్సిలింగ్ ముగిసిన తర్వాత ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఎంపిక చేసిన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచలేదని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నియామకాల్లో అధికారులు భారీగా అవినీతికి పాల్పడ్డారని, అందుకే గుట్టుచప్పుడు కాకుండా తమకు అనుకూలంగా ఉన్న వారికే ఉద్యోగాలు వచ్చేలా వ్యవహరించారని వారు మండిపడుతున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, జీఎన్‌ఎం (స్టాఫ్ నర్స్) నియామకాల్లో ఒక్కో పోస్ట్‌కు ఒక్కో ధర నిర్ణయించి వసూలు చేశారని, ఈ వ్యవహారంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి కీలకంగా వ్యవహరించారని వారు ఆరోపిస్తున్నారు. ఈ నియామకాలపై కలెక్టర్ ప్రత్యేకంగా విచారణ జరిపించి అర్హులకు ఉద్యోగాలు దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయమై ఆంధ్రజ్యోతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరవణను వివరణ కోరగా, ఎంఎల్‌హెచ్‌పీ, జీఎన్‌ఎం (స్టాఫ్‌నర్స్) నియామకాల్లో ఎలాంటి అవినీతి జరుగలేదని, తాము రోస్టర్, మెరిట్ ప్రకారమే నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు.

అర్హులని కాదని అనర్హులకు..

ఇదిలా ఉంటే, జీఎన్‌ఎం (స్టాఫ్ నర్స్) నియామకాల్లోనూ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారు. 110 బీసీ-బీ రోస్టర్‌లో 69.61 శాతం మార్కులు వచ్చిన అభ్యర్థి ఉండగా, అధికారులు ఆ అభ్యర్థికి ఉద్యోగం కల్పించలేదు. 111 ఓసీ రోస్టర్ ఉద్యోగాన్ని మరో కేటగిరికి చెందిన అభ్యర్థితో భర్తీ చేశారు. దీంట్లో 76.28 శాతం మార్కులు ఉన్న అభ్యర్థిని పక్కనబెట్టి 72.05 శాతం మార్కులు ఉన్న అభ్యర్థిని ఎంపిక చేశారు. 112 ఓసీ మహిళ ఉద్యోగానికి ఎంపిక చేసిన కేటగిరి అభ్యర్థుల్లో 76.14 శాతం మార్కులు ఉన్న అభ్యర్థిని వదిలేసి.. 72.05 శాతం ఉన్న వారిని ఎంపిక చేశారు. ఆ తర్వాత 113 ఓసీ ఎక్స్‌సర్వీస్‌మెన్ రోస్టర్ ఉండగా, అధికారులు భర్తీ చేసిన కేటగిరిలో 75.66 శాతం అభ్యర్థిని పక్కన బెట్టి 60.59 శాతం మార్కులు వచ్చిన అభ్యర్థిని ఎంపిక చేశారు. సామాజిక వర్గానికి చెందిన వారిలో మెరిట్ ఉన్న అభ్యర్థులకు అధికారులు కావాలనే కౌన్సిలింగ్ సమాచారం ఇవ్వకుండా.. తక్కువ మెరిట్ ఉన్న అభ్యర్థులకు సమాచారం ఇచ్చి ఎంపిక చేసుకున్నారని బాధిత అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

సుందరీకరణ.. సుదూరం!

(ఐదో పేజీ తరువాయి)

మొలిచి కళాహీనంగా దర్శనమిస్తోంది. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని అందంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. రూ. కోట్లతో 'మినీ ట్యాంక్ బండ్ 'ను నిర్మించాలని నిర్ణయించి నిధులు మంజూరు చేసింది. అయినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఈ పనులు చేపట్టేందుకు ముగ్గురు మంత్రులు కలిసి 2024 ఆగస్టు 5న తాండూరులో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. 10 నెలలు గడిచినా ఈ ప్రాజెక్టు పనులు అతీగతీ లేకుండా పోయాయి.

ఎక్కడ చూసినా వ్యర్థాలు, చెట్లు..

పనులు ప్రారంభించకపోవడంతో కట్ట పరిసరాల్లో చెత్త, వ్యర్థాలు, ముళ్ల కంపలు కనిపిస్తున్నాయి. ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి కట్టపై నడకదారిని సైతం కమ్మేస్తున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయమం, నడక, పరుగుకు అనుకూలంగా లేని పరిస్థితి. దీంతో యువత పట్టణానికి సుదూరంగా వెళ్లి వాకింగ్ చేసుకుటున్న పరిస్థితి. సందరీకరణ పనులు చేపడితే సమీపంలోనే సౌకర్యాలు సమకూరనున్నాయి. గతంలో మెట్లు, బెంచీలు, గుడి చుట్టూ బండలు, గ్రిల్లింగ్, రోడ్డు లెవలింగ్‌లు పనులు చేసి మిగతా పనులను వదిలేశారు. కట్టపై ఆకాశదీపాలు, కుర్చీలు, వాహనాల పార్కింగ్ స్వాగత తోరణాలు, మంచి నీటి సదుపాయం వంటి పలు రకాల సౌకర్యాలను ఇంకా కల్పించాల్సి ఉంది. దీనికితోడు చెరువు అంతా గుర్రపు డెక్కతో నిండిపోయింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించి ఈ మినీ ట్యాంకు బండ్ సుందరీకరణ పనులను త్వరగా ప్రారంభించేలా చొరువ చూపాలని చూడాలని ప్రజలు కోరుతున్నారు.



మెట్ల కింది భాగంలో పెరిగిన గుర్రపు డెక్క

ఆ 'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవాబుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చించల్‌పేట్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు 33 సంవత్సరాల తర్వాత ఒకేవేదికపై కలుసుకున్నారు. అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎల్.పాండు, పూర్వ ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, విష్ణు, గోవర్ధన్, యూసుఫ్, జర్నలిస్టులు మన్సూర్‌అలీ, మల్లేశం, మల్లేశంగౌడ్, గోపాల్‌గౌడ్, తమాల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1997-98 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్దులు నేర్పించిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, పూర్వ ఉపాధ్యాయులు సాయన్నగౌడ్, సాయిబన్న, చంద్రశేఖరగౌడ్, వెంకట్రాములుగౌడ్, చెన్‌బసప్ప, సాయప్ప, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

విరిగిన విద్యుత్ స్తంభాలు

● తప్పిన పెను ప్రమాదం

బొంరాస్‌పేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్లకుంట రోడ్డు మార్గంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గ్రామ సమీపంలోని వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌పై ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. దీంతో రోడ్డుపై రాకపోకలు దాదాపు గంటపాటు నిలిచిపోయాయి. స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్పందించిన అధికారులు విరిగిన స్తంభాలను తొలగించడంతో ప్రమాదం తప్పింది.



ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగి పడిన స్తంభాలు

నేడు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

కొడంగల్/పూడూరు/నవాబుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలంలోని పర్సాపూర్, చిట్లపల్లి, రావుల్‌పల్లి రైతు వేదికల్లో వర్షాకాలం 2025సీజన్ రైతు భరోసాలో భాగంగా సోమవారం మధ్యాహ్నం 3గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నట్లు కొడంగల్ మండల వ్యవసాయ అధికారిణి తులసి తెలిపారు. అదేవిధంగా పూడూరు, చెన్‌గోముల్, కంకల్ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని పూడూరు మండల వ్యవసాయాధికారి తులసిరామ్ తెలిపారు. చించల్‌పేట్, నవాబుపేట, ఎల్లకొండ గ్రామాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌కు ఏర్పాట్లు చేశామని చించల్‌పేట్ గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ బుచ్చయ్య తెలిపారు.